# అనవసర ప్రసంగం

*

చ. రా.

*

ఆఫీసునుంచి వచ్చి ముఖానికి చేతులకు కాళ్లకు స్నానం చేయించి కూర్చున్నా. ఇంతలోనే 'వున్నావటరా ఆనందం?' అంటూ వచ్చాడు మావాడు సుందరం.

ఇద్దరమూ ఫలహారాలు ముగించాము. బాతాఖాని మాత్రం జరుగుతూనే వుంది.

మేజామీదవున్న ఒక ఇంగ్లీషు పత్రికను సుందరానికందిస్తూ 'ఇది చూచావటరా? ఈ కథ ఎంతో బాగుంది. దీని అనువదించాలని అనుకుంటున్నా. ఏమంటావ్?' అన్నాను.

ఏది మాట్లాడినా మొదట తిట్లతో ప్రారంభించడం మావాడికి మహాసరదా.

'ఏడిశావులే! నీవూ నీ అనువాదాలూను, కథావస్తువు లెక్కడా కనపడలేదేమిట్రోయ్?'—అంటూ ఏమిటో వాగబోతున్నాడు.

నేను మధ్యలో అడ్డంవచ్చి 'ఒరే! దీన్ని ఒకమారు చూడు. తరువాత చెపుదువుగాని. ఇది చాలా బాగుంది' అన్నాను.

'బాగూ నీ ముఖమూను. ఇదో నిన్న మాఇంట్లోనే ఓ మంచి కథా వస్తువు దొరికిందిరా! చెపుతా విను. అల్లాంటివి వ్రాయాలిగాని అనువాదం మీదపడి అఘోరిస్తావేమిటిరా ఎపుడూ?' అన్నాడు సుందరం.'

'అలాకాదు. కథలకు వస్తువు కూడా—'

నేనింకా ముగించకముందే 'నీ సిద్ధాంతాలకేమిలే. వ్రాసేది తెలిస్తే నీకంటికగపడే అన్నింటిపైనాకూడా కథలు వ్రాయవచ్చు. నీవు వ్రాసేదాల్లోవుంది. సరే గాని వినుమరి' అన్నాడు.

'చెప్పరాదూ వింటాను?'

'అసలు నేను చెప్పేదే ఒక కథ అవుతుంది, దానిపై కథ అల్లవలసిందేలేదు' అని ఉపోద్ఘాతం మొదలెట్టాడు సుందరం. నాకు మండిపోయింది.

'అసలు విషయ మేమిటో చెప్పి తగలడరాదూ, యీ లెక్చర్లకంటె' అన్నాను.

హీ, హీ, అంటూ సుందరం మొదలెట్టాడు.

*      *      *

నిన్నరాత్రి భోంచేసిన తరవాత మేడ మీద వెన్నెల్లో ఆరుబైట మంచం వేయించి చాలా అలసటగావుంటే, పడుకున్నాను.

మా ఆవిడా పిల్లలు వూళ్లోలేరుగదా అంచేత నా విశ్రాంతి భంగంచేసేవారులేరు. నెమ్మదిగా పడుకొని ఏదో ఆలోచించుకుంటూ వున్నా.

భోజనాలు ముగించి మా అమ్మగారు బుల్లెమ్మ తమ్ముడు ఇద్దరు అమ్మాయిలు ఆరుబైటికివచ్చి కూర్చున్నారు. పెద్దవారి పోరుపడలేక పిల్లలు ఏవో పుస్తకాలు ముందు వేసుకొని చూచుకుంటున్నారు.

మా అమ్మా బుల్లెమ్మా లోకాభిరామాయణం ప్రారంభించారు.

చదువుమీదకంటే వారి బాతాఖానీమీదే ఎక్కువ

ఆసక్తివున్న మా బుల్లితమ్ముడు వారిని మధ్య మధ్య ప్రశ్నలువేస్తూ వారి సంభాషణలో చేరుతూ వున్నాడు. మాట్లాడేటంతటి ధైర్యంలేక నెమ్మదిగా వింటూ చదువుతున్నట్లు నటిస్తున్నారు. అమ్మాయిలు. వారి సంభాషణలో ఎన్నో సంగతులు దొర్లిపోతు న్నాయి. వున్నట్టుండి మధ్యలో మావూళ్లో ఇటీవలనే చనిపోయిన చాకలి బుచ్చిగాని సమాచారం వచ్చింది.

'పాపం చచ్చి స్వర్గలోకంలో ఎక్కడున్నాడో గాని చిన్నపుడు మన సుందరాన్ని ఎపుడూ ఎత్తుకొని ఆడిస్తూ వుండేవాడు' అంది మా అమ్మ వాని మీదగల ఆదరణతో.

'నిజమే పాపం' అని తాళం వేసింది మా బుల్లెమ్మ.

'బుచ్చిగాడు ఏలా చచ్చిపోయాడే అమ్మా?' అని గాలికి కాగితాలెగరకుండా ఒకచేత్తో పట్టుకుంటూ అడిగాడు మా బుల్లితమ్ముడు—విశ్వం.

'వాడికట చెప్పవే' అని సిఫార్సు చేసింది బుల్లెమ్మ.

'మరి నీవు వాన్ని ఉగాదిపండుగలో చూచావు గదటరా అబ్బాయి! మనమంతా ఇక్కడికి వచ్చినతరువాత పదిదినాలకు వాడు కూతురుని చూడాలని బైలుదేరాడట. వాడి కూతురున్నవూరు మనవూరికి—రేపల్లెకి—తూరుపు పది మైళ్లల్లో వుంటుంది.

'వాడు ఆ సాయంత్రం కల్లంగిడికి వెళ్లి బాగా కల్లు త్రాగాడట. అబ్బ! వాడెంత త్రాగేవాడనుకున్నావు? ఎవరు తిట్టినా సరే ఎపుడో దొంగతనంగా వెళ్లి తాగుతూ వుండేవాడు; వానికాబుద్ధి పోనేలేదు. ముసలయ్యే కొద్ది—'

ఇక విశ్వం వూరుకోలేకపోయాడు. 'కల్లుత్రాగాడు. తరువాత ఏం చేశాడే?' మాఅమ్మ వుపన్యాసానికి అడ్డం వచ్చాడు.

మా అమ్మ మరీ కథ అందుకున్నది.

'కల్లుత్రాగి అక్కడ ఎవరితోనో కూతురి వూరికి వెళ్లుతున్నానని చెప్పాడట. 'ఓరేయ్! మబ్బులుగా వున్నాయి. కృష్ణ ఒడ్డువెంబడిపోవాలి. భద్రం'అన్నారట. వాడేమీ లెక్కచేయకుండా దారిలో త్రాగడానికి ఇంకో బాటలులో మరింతకల్లు పోయించుకొని బైలుదేరాడట. సాయంత్రం 'నాలుగుబారల' ప్రొద్దే వుందట.

'వాడు ఆసాయంత్రము దారివెంబడి తిన్నగా వెళ్లకుండా తూలుతూ బురదలో—వరిమళ్లలో—పడుతూ లేస్తూ నడుస్తూవుంటే ఎవరో చూశారట. అయినా వాడు ఏమి నడచేవాడురా? తారాజువ్వలాగ ఒకటే ధాటితో వెళ్లిపోయేవాడు. వాడికి ఎంత నడచినా అలసటవుండేదే కాదు. వాడెంతో బరువులెత్తుకుని—'

మరల మావిశ్వం ఓర్పు చచ్చింది. మాఅమ్మకు అడ్డంవస్తూ 'అదికాదే అమ్మా! బుచ్చిగాడు వెళ్లుతూ వున్నాడు. అప్పుడేమయిందే?' అన్నాడు కోపంతో పుస్తకాన్ని గాలికి వదలేసి.

'ఏమనుకున్నావో వాడు బలే నడిచేవాడు' అంది మా బుల్లెమ్మ తాశాభ్యాసనముతో.

'అల్లా వెళ్లుతున్నాడుట. చీకటివల్ల కనిపించలేదో, దారిలో తొందరపడ్డాడో ఏమైందో ఏమో పాపం' అని నిట్టూర్పు విడిచింది మాఅమ్మ.

'కృష్ణలోపడి చచ్చాడేమిటి?' అని ఆదుర్దాగా ముగించాడు మావిశ్వం.

'ఒరేయ్! అలాకాదురా. మీఅమ్మకు తెలియదు. నన్నడుగు ఆసంగతి చెపుతాను' అంది మా బుల్లెమ్మ.

అంతవరకు ఆసంగతి ఎవరూ అడగనట్టూ మాఅమ్మ ఇంతవరకు చెప్పిన సంగతిని ఆమె విననట్టూ, ఆమె చెప్పిన సంగతి అంతా పూర్తిగా తాను విన్నతరవాతనే బుచ్చిగాని చావుసంగతి తనకు జ్ఞాపకానికి వచ్చినట్టూ తటాలున అందుకున్నది మా బుల్లెమ్మ.

దాంతో మాఅమ్మ వాదానికి సిద్ధమైంది.

'నిన్నడగడమేమిటే నేను చెపుతుంటేనీ?'

'వాడు చచ్చింది అలా కాదు మరి?'

'మరెలా చచ్చాడు?'

'నీకు తెలియదులే.'

'తెలిసివుంటే మరి చెప్పరాదూ?'

'తెలిసే చెపుతున్నా. వాడు నీటిలోపడి చావలేదులే. నా కది బాగా తెలుసు.'

'ఉండవచ్చు. అదేదో చెప్పరాదూ?'

'మరి, వాడు కూతురువుండే వూరులో గ్రామదేవతకు బలివేస్తానని ఒప్పుకున్నాడట ముప్పది రూపాయలకు—'

'బలీలేదు, భైరవీలేదు. వుత్తిమాటలు' అంది మా అమ్మ మధ్యలో.

ఎవరు చెప్పేది నిజమో వాడి కవసరంలేదు గాని చెప్పుతూవుంటే మాత్రం వినాలనివుండే మావిశ్వం 'అమ్మా వూరుకోవే' బుల్లెమ్మని చెప్పనీవే వాడెలా చచ్చాడో. నాకు వినాలనివుందే' అని అమ్మని బ్రతిమాలేడు.

బుల్లెమ్మ మొదలుపెట్టింది.

'ఆవూరులో గ్రామదేవతకు బలివేసి చాలాదినాలైందట. అందుచేత ఎవరు వేయడానికి భయపడేవారట. కాని బుచ్చిగాడు ఒప్పుకుని ముందుగానె కొంతపైకం తీసుకున్నాడట.'

'వట్టి అబద్ధం. డబ్బూలేదు, గిబ్బూలేదు' అంది మాఅమ్మ ఎదుటిపార్టీని నిరాటంకంగా సాగనీయకూడదన్నట్లు.

'ఇదేమిటమ్మా? వాడు తీసుకున్నాడంటుంటేనీ' అని బుల్లెమ్మ సమాధానం.

'చెప్పవే' అని విశ్వంగాని వేగిరింపు.

నే నిదంతా వింటూ పడుకొని వింటున్నానేగాని క్రిక్కురుమనలేదు. వాళ్లు నేను నిద్రపోయాననుకున్నారు పాపం' అన్నాడు సుందరం మధ్యలో నిల్చి.

'ఈ మహాసమాచారం చెప్పడానికి మీవారే ఇన్ని విరుపులు విరుస్తున్నారు. చాలందానికి నీవు కూడా మొదలుపెట్టావేమిటి?' అన్నాను నేను.

సుందరం తనకథనుసాగించాడు.

మాబుల్లెమ్మ ఇంకా తనమాట నిజమేనంటున్నట్టు గట్టిగా 'వాడు డబ్బుతీసికొన్నదినిజమే. వాడా గ్రామానికివెళ్లి గ్రామదేవతకు బలివేశాడట ఇంకా ఇద్దరితో కూడా. ఎంతైనా వాడుమనిషేగదూ; ఆదేవతకు కోపంవచ్చిందో ఏమో బుచ్చిగాడు తారుమని చచ్చిపోయాడు—'

మాఅమ్మ ఆమె నెక్కడవిడుస్తుంది? 'ఓహోహో ఏమిచెప్పావే? వాన్ని నీళ్లలోనుంచితీస్తే కాళ్లకు చెప్పులు అలాగేవున్నాయట. చేతిలో కొడవలి అలాగేవుందట! దానికేమంటావు' అని బుల్లెమ్మను ప్రశ్నించింది.

'జానుటమ్మా! వాడు చచ్చిపోతే కాళ్లకుచెప్పులు తొడిగి, చేతికి కొడవలి తగిలించారట. మొన్న ఆవూరినుంచి వచ్చినవారు చెప్పితేనేనాకు' అని డిఫెండు చేసుకుంది బుల్లెమ్మ.

'చాల్లేవే, ఎవరుచెప్పారో కాని—బుచ్చిగాని కొడుకునాకు చెప్పితే.'

తనవాదాన్ని నిలబెట్టుకోవాలని మాఅమ్మదొకటేపట్టు.

'సరేనమ్మా! ఒకరా ఇద్దరా? ఆవూరివారు అయిదుగురుచెప్పితే. ఇంతకూ ఇదేనిజం' అనిమాబుల్లెమ్మ.

'అది కాదంటూ వుంటే'—అలాఅయితే వాని కొడుకునాకుచెప్పడూ'—అనిమాఅమ్మ.

'వానికంతా తెలిసినట్టు వాడుచెప్పడానికి. నేను చెపుతూవుంటే వాడుబలి——'అనిబుల్లెమ్మ.

'ఇకచాలించు. వాడికి తెలియదు నీకంతా తెలుసు నీమొహం' అని కొంత ధ్వని యెక్కువచేసింది మాఅమ్మ.

వారి మాటల్లో తనకేమీ ఆసక్తికలగకపోగా వారు లేనట్లే కాగితాలు తిరగవేసుకుంటున్నాడు మా విశ్వం.

అయినా మాఅమ్మ బుల్లెమ్మలవ్యాజ్యం తీర్మానం అయ్యేటట్టుగాలేదు చూస్తే. పైగా ముదురుతుందేమో అని భయంవేసిందినాకు.

ఇకనైనా కలగజేసికోనకపోతే బాగుండదనుకున్నా.

'ఏమేఅమ్మా! బుచ్చిగాడు చనిపోయినపుడు మీరిద్దరూ వూళ్లోలేరు. ఇద్దరికీ ఎవరో చెప్పినారు. వారైనా చూచినవారు కారు. నేనుచెప్పిందే నిజం నేనుచెప్పిందే సత్యమంటూ మీకీకంతశోష ఎందుకే! పైగాను?' అన్నాను మంచంమీద నుండి లేస్తూ.

'అది కాదురానాయనా! వాడునీటిలో పడివుంటే కూతురే గుర్తుపట్టితీయించిందట; ఎంతోమంది వచ్చిచూచారట!' అది మాఅమ్మ జయంపొందినట్టుగా.

'మరిచూడరూ' అనిబుల్లెమ్మ తాళంవేసింది.

'పోలీసులందరు వచ్చి వాన్ని పరీక్షించారట' అని మరల మాఅమ్మ అంటే,

'చేసూరూమరి' అని బుల్లెమ్మ తాళాభ్యాసనం సాగిస్తూ.

సరే వ్యాజ్యం ముగిసింది. ఇహ ఒకరు చెప్పడం ఇంకొకరు తాళంవేయడం సరిపోతుంది. ఇదెప్పుడు ఆగుతుందో నాకర్థంగాలేదు. 'అమ్మా! పాలిటిక్స్ వే. నిద్రవస్తూవుంది' అన్నాను.

* * *

'అయితే ఇది కథంటావేమిటరా' అన్నాను సుందరంతో.

'కథో కబుర్లో. నిర్ణయించవలసింది నీవు కాదులే' అన్నాడు సుందరం.

---

# శ్రీమతి బాలాంత్రపు శేషమ్మగారి షష్టిపూర్తి ప్రశంస

ఉ. నీదికదా యదృష్టమవనిన్ గనువిందగు షష్టిపూర్తి ము
త్తైదువవైతి; వజ్ఞలగు నాంధ్రపురంధ్రుల మేలుగోరి సం
పాదనఁ జేయుచుంటివి శుభంబుగఁ బత్రిక శేషమాంబ నీ
కాదిమదేవుఁడిచ్చుఁ బరమంబగు నాయువు శ్రీయు నిత్యమున్.

ఉ. ఒంటిగ ముప్పదేండ్లబల యోర్పున నేర్పున మాసపత్రికన్
దంటలమారికాలమునఁ దద్దయుఁ బూనిక నిర్వహించు నీ
వంటి మఱొక్కతెన్ గనము పల్కుట చుల్కన శేషమాంబ! వా
ల్గంటుల మేలుబంతివని కాంతురునిన్ననె కార్యదీక్షలన్.

కం. కనకమ్మ.